www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 అక్టోబర్ 2023
5
పశ్చిమ గోదావరి

బస్సు డ్రైవర్‌పై వ్యక్తి దాడి

ముదినేపల్లి: ఆర్‌టిసి బస్సు డ్రైవర్‌పై వ్యక్తి దాడి చేసిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని సింగరాయపాలెం సెంటర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. భీమవరం డిపోనకు చెందిన బస్సు భీమవరం నుంచి విజయవాడ వెళ్తోంది. ఈ క్రమంలో బస్సు మండలంలోని సింగరాయపాలెం సెంటర్‌కు చేరుకునే సరికి గుడివాడ నుంచి కలిదిండి ఇంటి సామగ్రి లోడుతో వెళ్తున్న ఆటోను డ్రైవర్ కోరుకొల్లు రోడ్డు మధ్యలో ఆపాడు. దీంతో బస్సు డ్రైవర్ సురేష్ ఆటో బస్సుకు అడ్డుగా ఉంది, ఆటోను పక్కకు పెట్టండని అడిగాడు. దీంతో ఆటో డ్రైవర్‌కు, బస్సు డ్రైవర్‌కు మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఆటోడ్రైవర్ పక్కన కూర్చుని ఉన్న గుడివాడకు చెందిన బోయిన సుబ్బు బస్సు డ్రైవర్ సురేష్ తలపై బలంగా కొట్టడంతో రక్త గాయమైంది. దీంతో డ్రైవర్ స్పృహ కోల్పోయి కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు డ్రైవర్‌కు ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్యాస్ ధర తగ్గింపు..
అరశాతం మందికే..!

- ఉజ్వల గ్యాస్ సిలిండర్ ధరలో మరో రూ.వంద సబ్సిడీ ప్రకటించిన కేంద్రం
- ఉమ్మడి జిల్లాలో 8.14 లక్షల గ్యాస్ కనెక్షన్లు
- ఉజ్వల్ గ్యాస్ కనెక్షన్‌దారులు 3,848 మందే
- మిగిలిన లక్షలాది గ్యాస్ వినియోగదారుల పరిస్థితి ఏమిటని ప్రశ్న
- గ్యాస్ ధర రూ.1100కు పెంచి రూ.200 తగ్గింపు ఎన్నికల జిమ్మిక్కే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ సర్కార్ మరోసారి ఎన్నికల జిమ్మిక్కులకు దిగింది. గడిచిన తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో అందనంత ఎత్తుకి వంటగ్యాస్ సిలిండర్ ధరను పెంచి.. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రూ.వంద, రూ.200 తగ్గిస్తూ జనాన్ని మరోసారి మాయ చేసేందుకు పూనుకుంది. వంటగ్యాస్ ధర తగ్గింపుపై మోడీ సర్కార్ విన్యాసాలు చూస్తే ఇవంతా ఎన్నికల జిమ్మిక్కులని అర్థమవుతోంది. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌దారులకు గతంలో రూ.200 సబ్సిడీ ప్రకటించిన కేంద్రం, బుధవారం కేంద్ర కేబినెట్‌లో మరో రూ.వంద తగ్గించి సిలిండర్‌కు రూ.300 సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం ప్రకటించిన రూ.వంద సబ్సిడీ అందుకునే ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారుల సంఖ్య చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 12,90,004 వంటగ్యాస్ కనెక్షన్లు ఉండగా వీటిలో జనరల్ కనెక్షన్లు 8,14,847 ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన దీపం కనెక్షన్లు 4,40,282, సిఎస్ఆర్ కనెక్షన్లు 29,468, ఐదు కిలోల గ్యాస్ కనెక్షన్లు 1,559 ఉన్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించిన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్నవి కేవలం 3,848 మాత్రమే. ప్రస్తుతం గ్యాస్ వినియోగదారుల్లో ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్న లబ్ధిదారులు నామమాత్రం. అంటే ప్రభుత్వం ప్రకటించిన రూ.వంద తగ్గింపు గ్యాస్ వినియోగదారులందరికీ వర్తించదు. దీంతో జిల్లాలో ఎనిమిది లక్షలకుపైగా గ్యాస్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ వర్తించదు. మోడీ అధికారంలోకొచ్చాక వంటగ్యాస్ సిలిండర్ ధరపై చేసిన మోసం పరిశీలిస్తే విస్తుపోక తప్పదు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చేసరికి 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.450 లోపే ఉంది. మోడీ వచ్చాక ఏడాదిలో నాలుగైదుసార్లు గ్యాస్ సిలిండర్ ధరను పెంచుకుంటూ వచ్చారు. దీంతో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1130కు చేరింది. వంటగ్యాస్ ధర పెంచడమే కాకుండా వినియోగదారుల ఖాతాల్లో వేసే సబ్సిడీ సొమ్మును సైతం కేంద్రం నిలిపివేసింది. దీంతో జనాలు మోడీ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2024లో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు మోడీ ఎన్నికల జిమ్మిక్కులకు తెర లేపారు. ముందుగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌దారులకు రూ.200 ధర తగ్గిస్తున్నట్లు ప్రకటించి తాజాగా మరో రూ.వంద తగ్గిస్తున్నట్లు ప్రకటించారు. కొద్దిరోజుల క్రితం జనరల్ వంట గ్యాస్ కనెక్షన్‌దారులకు రూ.200 తగ్గించారు. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే రూ.1100కుపైగా గ్యాస్ సిలిండర్ ధర పెంచి రూ.200 తగ్గించి జనాలకు ఏదో మేలు చేస్తున్నట్లు కేంద్రంలోని మోడీ సర్కార్ గొప్పలు చెబుతుండటం విస్మయం కల్గిస్తోంది. ఇటీవల తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు పరిస్థితీ ఇదేవిధంగా ఉంది. బిల్లు ఇప్పుడు ఆమోదం పొందితే అమలు మాత్రం 2029 తర్వాతే అని చెప్పారు. అంటే వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికే మోడీ సర్కార్ ఇలాంటి జిమ్మిక్కులు చేస్తుందని స్పష్టమవుతోంది. వంటగ్యాస్ వినియోగదారులు మాత్రం మోడీ సర్కార్ మోసాన్ని ఇప్పటికే గ్రహించారు.

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

మీడియా స్వేచ్ఛను హరిస్తున్న బిజెపి ప్రభుత్వం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - భీమవరం

ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియా స్వేచ్ఛను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. ఢిల్లీలో పత్రిక, మీడియా ఛానల్స్ కార్యాలయాలపై మోడీ ప్రభుత్వ దాడులను ఖండిస్తూ స్థానిక సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ స్వాతంత్ర భారతదేశ చరిత్రలోనే ఈ ఫాసిస్టు తరహా దాడిని ఇప్పటి వరకూ చూడలేదన్నారు. ఢిల్లీలో కొన్ని న్యూస్ ఛానల్స్ కార్యాలయాలపైన, పత్రికా కార్యాలయాలపైన సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు అత్యంత దుర్మార్గమన్నారు. పేపర్లన్నింటినీ కట్టలు కట్టుకుని పోయి కొంతమందిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారని, మరికొంతమందిని ప్రవేశ పెట్టలేదని ఆరోపించారు. ప్రతిపక్షాలపైన, ప్రజాస్వామికవాదులు, మేధావులపైన, అభ్యుదయవాదులపైన అప్రజాస్వామికంగా మోడీ, అమిత్‌షా దాడులు చేయడం దారుణమన్నారు. మోడీ ప్రభుత్వ ఈ దుర్మార్గ, కుట్రపూరిత చర్యలను అంతా ఖండించాలన్నారు. మీడియా, పత్రికా స్వేచ్ఛ కోసం వామపక్షవాదులుగా మేధావులను, ప్రజాతంత్రవాదులను, అభ్యుదయవాదులను ఐక్యం చేసి ఈ నిరంకుశ విధానాలను తిప్పికొడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, కవురు పెద్దిరాజు, డి.కళ్యాణి, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యకర సమాజం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - పోడూరు

ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో వైద్య సేవలందించి ఆరోగ్యకర సమాజానికి కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం మండలంలోని కవిటంలో ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహించిన జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. క్రానికల్ డిసీజ్ కేసులు గుర్తించారా, ఎక్కువగా ఏ ఏ జబ్బులతో రోగులు శిబిరానికి వస్తున్నారని వైద్యులను ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులపై అధికంగా కేసులు నమోదవుతున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను, మందుల నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ వాలంటీర్లు, ఎఎన్‌ఎంల ఆరోగ్య సర్వేతోపాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిడిఎన్‌సిడి సర్వే జాబితా వివరాలు ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. అక్కడున్న వద్ధురాలిని వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీయగా గ్రామంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండి సేవలు అందిస్తుండడంతో ఎవరి అవసరం లేకుండా వైద్య పరీక్షల కోసం శిబిరానికి స్వయంగా వచ్చానని ఆమె బదులిచ్చారు. దీనిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గృహనిర్మాణ పీడీ డాక్టర్ ఆర్‌సి.ఆనందకుమార్, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, గృహనిర్మాణ శాఖ ఇఇ ఆర్.వెంకటరమణ, డిఇ ఆర్.త్రిమూర్తులు, వైద్యాధికారులు, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచులు చెల్లబోయిన శారద, చుట్టిగుళ్ల పూర్ణిమ, జె.మహాలక్ష్మి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

జగనన్న కాలనీల పరిశీలన

మండలంలోని వేడంగి, కవిటం గ్రామాల్లో జగనన్న కాలనీలను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించి త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని లబ్ధిదారులను ఆదేశించారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీరు తొలగించాలని అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణం చేసి గృహప్రవేశాలు చేసుకున్న లబ్ధిదారులను కలెక్టర్ అభినందించారు. ఇళ్ల దగ్గర నీరు నిల్వ ఉండకుండా ఇంకుడు గుంతలు తవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, తహశీల్దార్ ఆర్.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, సర్పంచులు చుట్టూగుల్ల పూర్ణిమ, పద్మావతి, కలిదిండి గణపతిరాజు, కొప్రపాటి వీరాస్వామి, ఆర్అండ్‌బి, హౌసింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

వైద్యుల సహకారం ఎంతో అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణకు వైద్యుల సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణ, సేవలపై ఐఎంఎ ప్రతినిధులు, వైద్యఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమై సమీక్షించారు. జగనన్న ఆరోగ్య శిబిరాలకు ప్రత్యేక వైద్య నిపుణుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. ఈ విషయమై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యులను సమకూర్చాలని కోరారు. సెప్టెంబర్ 30న జిల్లాలో జగనన్న ఆరోగ్య శిబిరాలు ప్రారంభించి వైద్య సహాయం అందిస్తున్నారన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న ఎఎన్‌ఎం, ఆశా వర్కర్, వాలంటీర్లు తాము జరిపిన సర్వే ప్రకారం వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు తరలించి వారందరికీ చికిత్స అందించేలా మరింత కృషి చేయాలన్నారు. ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో వైద్య సేవలందించి ఆరోగ్యకర సమాజానికి కృషి చేస్తుందని వైద్యాధికారులు, సిబ్బంది ఎంతో బాధ్యతగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ వాలంటీర్లు, ఎఎన్‌ఎంల ఆరోగ్య సర్వేతోపాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిడిఎన్‌సిడి సర్వే జాబితా వివరాలు ఆధారంగా రోగులను గుర్తించి ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. శిబిరానికి వచ్చే వారికి అవసరమైన ఆరోగ్య చికిత్సలతోపాటు మనోధైర్యాన్ని నింపాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ భానునాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి, భీమవరం, పాలకొల్లు, ఆకివీడు, నరసాపురం ఐఎంఎ ప్రతినిధులు పాల్గొన్నారు.

లైవ్ స్టాక్ మిషన్‌ను వినియోగించుకోవాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రంలోని గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ల పెంపకం దారులందరూ జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌ను వినియోగించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక నెక్ కళ్యాణ మండపంలో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులందరికీ ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఈ మిషన్ ఉపయోగించుకుని ఆర్థిక పరిపుష్టిని పెంచుకోవాలని, అన్ని బ్యాంకులూ వారికి రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతులందరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోందని రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలని, దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా తగిన వివరాలు పొందాలని కోరారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని బ్యాంకుల ద్వారా రైతులకు సబ్సిడీపై రుణాలు అందిస్తామన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక సంచాలకులు డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ మిషన్ ద్వారా అందించే కార్యక్రమాలకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సహకరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ, తాడేపల్లిగూడెం ఉపసంచాలకులు డాక్టర్ ఎల్‌కె.సుధాకర్, భీమవరం ఉపసంచాలకులు డాక్టర్ జోహార్ హుస్సేన్, నెక్ అధ్యక్షులు గంగాధర్, పౌల్ట్రీ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కెవి.సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు అన్నారు. శృంగవృక్షంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సందర్భంగా బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పివిఎల్ పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు సర్పంచి సూరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతిఒక్కరికీ ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్యోద్దేశంతో ప్రభుత్వం మంచి కార్యక్రమానికి నాంది పలకడం అభినందనీయమన్నారు. పివిఎల్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతోపాటు ఆరోగ్యాన్ని అందించాలని జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కలిదిండి ఆనందరాజు, వైస్ ఎంపిపి సోడదాశి నరేష్, వైసిపి మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బొల్లా శ్రీనివాస్, విస్సాకోడేరు సొసైటీ ఛైర్మన్ గడ్డం జోషి, శృంగవృక్షం సొసైటీ మాజీ అధ్యక్షులు పేరిచర్ల కనకరాజు, నడింపల్లి రామకృష్ణంరాజు, పెన్మెత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్‌బాబు, చెల్లబోయిన పాపారావు, ఎంపిడిఒ మురళీగంగాధర్‌రావు, తహశీల్దార్ షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

స్టాల్‌ను పరిశీలిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

మహిళలపై అత్యాచారాలు అరికట్టండి

ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రంలో బాలికలు, మహిళలపై అత్యాచారాలను, హత్యలను అరికట్టాలని, నిందితులను పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక దుంపగడప మార్గంలో ఉన్న రైల్వేగేట్ వద్ద నుండి యువతీ, యువకులు పెద్దసంఖ్యలో కొవ్వొత్తులు చేతపట్టి పాతబస్టాండ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్దకు చేరారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, ఐద్వా పట్టణ కార్యదర్శి డోకల లక్ష్మి మాట్లాడుతూ భీమవరం పట్టణంలో ఇటీవల బాలికపై సొంత చిన్నాన్న అత్యాచారం చేసి హత్యకు పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ దాడులను ఖండిస్తూ నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ హత్యలు, దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. ఈ పాశవిక హత్య, దాడులకు పాల్పడుతున్న నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి డి.రవితేజ, ఐద్వా నాయకులు జివి.లావణ్య, సిఐటియు పట్టణాధ్యక్షులు పెంకి అప్పారావు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

న్యాయవాదులపై ఎన్ఐఎ దాడికి ఐలు ఖండన

ప్రజాశక్తి - పాలకొల్లు

న్యాయవాదుల గృహాలపై ఎన్ఐఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) అధికారులు దాడులు చేయడాన్ని ఆలిండియా లాయర్స్ యూనియన్ ఖండించింది. ఈ మేరకు ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, జిల్లా నాయకులు పామర్తి నగేష్, జెవి.సుబ్రహ్మణ్యం, పూరిళ్ల శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. నక్సలైట్ల సానుభూతిపరుల పేరుతో న్యాయవాదుల గృహాలపై దాడి చేయడం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఏ కారణంతో, ఏ అధికారంతో దాడికి పాల్పడుతున్నారని ఎన్ఐఎ అధికారులను ప్రశ్నించగా దానికి సరైన సమాధానం చెప్పకుండా ఉన్నతాధికారులు చెప్పినట్లుగా చేస్తున్నామని చెప్పడం శోచనీయమని తెలిపారు. వెంటనే ఇటువంటి దాడులను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాదులు పిచ్చుక శ్రీనివాస్, టి.ఆంజనేయులు ఇళ్లలో ఎన్ఐఎ సోదాలు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఎన్ఐఎ అధికారులు దాడులు చేసిన న్యాయవాదులు ఏ కేసుల్లోను ముద్దాయిలుగా పేర్కొనబడలేదని తెలిపారు. ఏ న్యాయస్థానం కూడా నేరస్తుడిని విచారణ లేకుండా, న్యాయవాది సహాయం లేకుండా విచారణ చేయడం, శిక్షించడం జరగదని తెలిపారు. న్యాయవాదులకు, వారి క్లయింటులకు మధ్య జరిగిన చర్చలు, విషయాలు వృత్తిపరమైన సమాచారం కిందకు వస్తాయని, ఆ విషయాలపై విచారణ చేయడం, ఆ విషయాలపై సాక్ష్యం చెప్పమనడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ దాడులు న్యాయవాద వృత్తిపై దాడులుగా భావించాల్సి వస్తుందని ఎన్ఐఎ అధికారులను హెచ్చరించారు.

మంత్రి కొడుకును కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పోడూరు

లఖింపూర్‌లో కారు ఎక్కించి నలుగురు రైతుల మరణానికి కారణమైన మంత్రి కొడుకును కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బల్లవంతెన వద్ద మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రాణాలు తీస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బొంతు శ్రీను, సీకరమెల్లి జయరాజ్, గుమ్మళ్ల చంద్రంబాబు, జోగి కనకం, జి.సూర్యారావు, ఆర్.కుమార్, గుబ్బల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు.

పేదలకు ఆరోగ్య సురక్ష వరం

మొగల్తూరు : సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాద్‌రాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను చేపట్టిందని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం మొగల్తూరు-2 పడమటిపాలెం గ్రామ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపిలు కైలా సుబ్బారావు, కవురు సీతామాలక్ష్మి, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

గణపవరం : పేదవాడికి ఖరీదైన వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం గణపవరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశానికి గణపవరం గ్రామ సర్పంచి మూర అలంకారం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడారు. శిబిరంలో 412 మందికి వైద్య సేవలందజేశారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆరుగురికి కళ్లజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి, తాడేపల్లిగూడెం ప్రసూతి వైద్యులు ఎం.దివ్యవాణి పాల్గొన్నారు.

పెనుమంట్ర : ప్రజలంతా ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. బుధవారం నత్తారామేశ్వరంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సర్పంచి వెలగల ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పి.పద్మజ, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), వైద్యాధికారిణి కె.లావణ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలపు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆచంట : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ అన్నారు. శేషమ్మచెరువు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ నరసింహప్రసాద్ వైద్య సేవల పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం కంటి వెలుగు ద్వారా వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివరంజని, సత్యవతి, వేణు, కిషోర్, ఇఒపిఆర్‌డి బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : అరట్లకట్ట గ్రామంలో ఎలిమెంటరీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచి పాస్ రాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి చింతపల్లి సాయిబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజుల నాయుడు, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరం : మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన : ఎంఎల్‌ఎ గ్రంధి

కొణితివాడలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తెచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దేశంలోనే అత్యుత్తమ జననాయకుడిగా నిలిచారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొణితివాడ-2, గవరపాలెంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకెళ్లాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వాలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. ప్రతి 50 కుటుంబాలకూ ఒక వాలంటీర్‌ను నియమించారని తెలిపారు. వీరందరినీ సచివాలయ వ్యవస్థకు అనుసంధానం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమయ్యేవిధంగా ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారన్నారు. దేశంలోనే ఒక వినూత్న రీతిలో పాలన చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల ఆశీస్సులు పూర్తిగా ఉన్నాయన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600కి పైగా హామీలిచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. అయితే మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం కరోనా వచ్చి రాష్ట్ర ఆదాయం గణనీయంగా దెబ్బతిన్నప్పటికీ ఎక్కడా కూడా వెనుకడుగు వేయకుండా ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని కూడా నెరవేరుస్తున్నారన్నారు. అనంతరం సచివాలయ భవనానికి స్థలం దానం ఇచ్చిన దాతల కుటుంబ సభ్యులు బీశెట్టి కోటేశ్వరరావు, శ్రీనివాసును ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బీశెట్టి లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిటిసిలు నాగరాజు పద్మకల పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రభుత్వానిది దుర్మార్గపు పాలన'

ఉండిలో దీక్షలో పాల్గొన్న ఎంఎల్‌ఎ రామరాజు, నేతలు

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామిక, దుర్మార్గ పాలన కొనసాగిస్తోందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆచంటలో టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 22వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి దుర్మార్గపు ఆలోచనలతో పరిపాలన సాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కట్టా బాలాజీ, పవన్ కుమార్, దొంగ శ్రీనివాస్, బండి సత్యప్రసాద్, కండిబోయిన సత్యనారాయణ, గండి బోయిన శ్రీనివాస్, రమేష్ రాజు, తమన్నా పూడి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తణుకు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ నాయకత్వంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 22వ రోజు కొనసాగాయి. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్ కార్యకర్తలకు కండువాలు వేసి దీక్షనులను ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు బసవ రామకృష్ణ, టిడిపి పట్టణ అధ్యక్షులు కలవర వెంకటకృష్ణ, ఇరగవరం మండలం అధ్యక్షుడు గోపీశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు విమర్శించారు. ఉండిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో ఎంఎల్‌ఎ మాట్లాడారు. ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకుని, ఆయనకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గేదెల జాన్, గుండాబత్తుల నాగేశ్వరరావు, రియాజుద్దీన్, సిరాజుద్దీన్, బొల్లం వెంకట్రావు, దూబ సురేష్, నౌకట్ల రామారావు పాల్గొన్నారు.

పాలకొల్లు : టిడిపి అంటే బిసిల పార్టీ అని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 22వ రోజు యలమంచిలి మండలం శెట్టి బలిజ సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. నల్ల బెలూన్లతో ప్రదర్శన చేసి దీక్షల్లో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, మామిడి శెట్టి పెద్దిరాజు, కడలి గోపి పాల్గొన్నారు.

పాలకొల్లులో బెలూన్లతో నిరసన తెలుపుతున్న శెట్టిబలిజ సంఘం సభ్యులు

ఆచంటలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

పారిశుధ్యం అధ్వానం..!

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ - వ్యాధుల బారిన ప్రజలు - పట్టించుకోని అధికారులు

బలిసిమూడి పుంతరోడ్డు డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మున్సిపాల్టీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. అయినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడక ముందు నుంచే ఉమ్మడి జిల్లాలో విద్యా కేంద్రాలను ఆర్థిక రాజధానిగాను రాష్ట్రంలోనే ఎంతో గుర్తింపు పొందిన పట్టణంగా నేటికీ కొనసాగుతోంది. అయితే ఇక్కడ అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలోని పారిశుధ్యం అధ్వానంగా తయారై దోమల పురిటి గెడ్డలా మారింది. పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు పట్టణం ఎప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు లక్షల రూపాయల ప్రజల ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. అయినప్పటికీ పారిశుధ్యంలో మాత్రం మార్క్ అప్ చేయట్లేదు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా, దోమలతో ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు గురవుతున్నారు. ఎక్కువ శాతం డెంగీ బారినపడి వేలకు వేలు ఆసుపత్రులకు కడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ రోగులు ఒక వార్డులో పదుల సంఖ్యలో ఉంటున్నారంటే పరిస్థితి ఎంత దయనీయ స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పారిశుధ్య నిర్వహణలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణ ప్రధాన కూడలిలో పారిశుధ్యం కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ శివారు ప్రాంతాల్లో కుప్పలు తెప్పలుగా రోజుల తరబడి చెత్తాచెదారాలు ఉండడంతో ప్రజలు మరింత ఇబ్బందులు గురవుతున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ మున్సిపాల్టీకి జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారిగా ఉన్నప్పటికీ అధికారుల పనితీరులు మాత్రం ఉన్నతాధికారుల పర్యవేక్షణ తమపై ఉందని భావన లేకపోవడం ఈ అధికారుల నిర్లక్ష్యానికి కారణమని పలువురు భావిస్తున్నారు. ముఖ్యంగా అరుంధతీ పేట, గునుపూడి, లంకపేట ప్రాంతాలతో పాటు పట్టణంలోని కాల్వగట్ల వెంబడి చెత్త వేసి డంపింగ్ యార్డుగా మార్చేస్తున్నారు. స్థానిక 32వ వార్డులో పరిస్థితి మరింత దారుణంగా మారంది. ఇదే ప్రాంతంలో ఉన్న బలిసిమూడి పుంత రోడ్డు మరింత దారుణంగా తయారైంది. ఇక్కడ డ్రెయినేజీలో కిలోమీటర్ మేర ప్లాస్టిక్ కవర్లు, సీసాలు ఇతర వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసన వల్ల తాము ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది పేరుకుపోయిన చెత్తను సరిగ్గా తొలగించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మున్సిపాల్టీలోని సమస్యలను, ప్రత్యేకంగా పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సురేష్ కుమార్‌ను అభినందిస్తున్న సీతారామ్, స్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొడమంచిలి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఆచంట

నవంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు కొడమంచిలి హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న పులిదిండి సురేష్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ మాట్లాడారు. ఈ నెల 29వ తేదీన పెదతాడేపల్లిలోని భారతీయ విద్యా భవన్స్‌లో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వాలీబాల్ సెలెక్షన్స్‌లో అండర్ -14 విభాగంలో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ప్రతి సంవత్సరమూ రాష్ట్రస్థాయి వాలీబాల్ జట్టుకు కొడమంచిలి స్కూల్ నుంచి విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే వాలీబాల్ పోటీల్లో విద్యార్థి రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న పీడీ చిరంజీవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమణారావు, పోలిశెట్టి వనమారాజు తదితరులు సురేష్ కుమార్‌ను అభినందించారు.


శ్రీనివాసు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పితాని

శ్రీనివాస్ కుటుంబానికి పితాని పరామర్శ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు తొమ్మిదో వార్డు సభ్యులు పత్తికాయల శ్రీనివాసు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం శివారపేట గ్రామంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులును మాజీ మంత్రి పితాని సత్యనారాయణ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కర్రి అచ్యుత రామారెడ్డి, తేతలి రాజారెడ్డి, సోమిరెడ్డి, మల్లిడి అబ్బు, ఆచారి, కారిపెల్లి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ బహూకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

బాధితునికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేస్తున్న సభ్యులు

ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న పట్టణంలోని బంగారువారి చెరువుగట్టుకు చెందిన జమ్ము సాయికి పాలకొల్లు మానవత శాఖ ఆక్సిజన్ కాన్సంట్రేటర్ బహూకరించింది. 24 ఏళ్ల వయసు గల సాయికి ఊపిరితిత్తులు పూర్తిగా పాడైపోవడంతో నిరంతరం అతను ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం మానవత శాఖ దృష్టికి రాగా మానవత సభ్యుడు బోళ్ల శ్రీనివాసరావు స్పందించి ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను సమకూర్చారు. మానవత కార్యవర్గ సభ్యుడు (ఆరోగ్యం) మేడికొండ రామదాస్ ఆధ్వర్యంలో దీన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు శాఖా కన్వీనర్ ముత్యాల రామారావు, అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, ఆత్మీయ సహకార కమిటీ కన్వీనర్ రేపూరి సూర్యనారాయణ, సభ్యుడు విన్నకోట వెంకటరమణ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఉండి

కోలమూరు గ్రామంలోని కోడిపందేల స్థావరంపై దాడి చేసినట్లు ఎస్ఐ కె.గంగాధర్ తెలిపారు. దాడిలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 64,610 రూపాయల నగదు, 3 మోటార్ సైకిళ్లు, 3 కోళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాయకుదురులో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సర్పంచి

విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

రూరల్ ఏరియాల్లో కళాశాల ఏర్పాటు చేయడం విద్యార్థినులకు వరమని, వారి ముంగిట్లోనికే కళాశాలల విద్య రావడం అదృష్టమని రాయకుదురు గ్రామ సర్పంచి జి.భారతి భాస్కరరావు అన్నారు. రాయకుదురు ఉన్నత పాఠశాల, మహిళా జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచి గెడ్డం భారతి భాస్కరరావు మాట్లాడుతూ పదో తరగతి తరువాత దూర ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగాక చాలామంది మానివేసే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూరల్ ప్రాంతాల్లో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఎందరో విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఎంతగానో రుణపడ్డామన్నారు. అనంతరం పాఠశాలలో పనిచేసి రిటైర్ అయిన ఉపాధ్యాయులు కె.వీరభద్రరావు ఆర్థిక సహాయంతో విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను అందజేశారు. శివదేవుని చిక్కాల శ్రీరాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థినులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నరసింహారావు, వరప్రసాద్, కె.వీరాస్వామి, సుబ్బరాజు, గురుమూర్తి, మెంటే అరుణ, జి.ఘట్కర్ పాల్గొన్నారు.

5లోపు ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి - అత్తిలి

ఈ నెల 5వ తేదీలోపు రైతులు ఇ-పంట, ఇకెవైసి నమోదు చేయించుకోవాలని ఎఒ టికె.రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ చేయించుకోనట్లయితే వారికి రైతుభరోసా, పిఎం కిసాన్, పంట నష్టపరిహారం, పంటల బీమా వర్తించవని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మొక్కలు నాటుతున్న సభ్యులు

ఎంఎస్‌ఎన్‌ఎం కళాశాలకు మొక్కలు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులోని ఎంఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థానిక లయన్స్ క్లబ్ వారు 100 మొక్కలు అందజేశారని కళాశాల ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎం.జోగిరెడ్డి, ఉపాధ్యక్షులు సిహెచ్ సతీశ్‌కుమార్, ఎన్.శైలజ, కార్యదర్శి ఎస్.సుబ్బారావు, కోశాధికారి కె.అజయ్ కుమార్, సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం వృక్షశాస్త్రం విభాగం, ఎకో క్లబ్, ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ లయన్స్ క్లబ్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిటిసి అనురాధ

బస్ షెల్టర్ల ఏర్పాటు అభినందనీయం

పెనుమంట్ర : మార్టేరు సెంటర్లో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు తన సొంత నిధులతో నాలుగు బస్ షెల్టర్లు, సులబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంపిటిసి-1 కర్రి అనురాధ అన్నారు. బుధవారం ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ మార్టేరు సెంటర్లో పాలకొల్లు రోడ్డులో, కోడేరు రోడ్డులో, పెనుగొండ రోడ్డులో, గూడెం రోడ్డులో బస్ షెల్టర్లు, సులబ్ కాంప్లెక్స్ తన సొంత నిధులతో నిర్మించారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి-2 గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, వార్డు సభ్యులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : ఎంఎల్‌ఎ

పాలకొల్లు : రాబోయే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశిస్తాయని, ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. పట్టణం 3, 29వ వార్డుల్లో జరిగిన టిడిపి సాధికార మిత్ర, సేవా మిత్ర, తెలుగు యువత, ఐటిడిపి సభ్యులతో బుధవారం సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్న రాష్ట్రాలతో పోటీపడుతోందన్నారు. ప్రతి కుటుంబమూ ఏదో ఒక సమస్యతో బాధపడుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, జివి, జనాని సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

KANAKADURGA
FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఏలూరురోడ్డు, లక్ష్మీథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, జెడ్ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరావంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-10-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1139.10 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
ELURU AREA CELL NO- 8074656196

పాస్‌పోర్టు పడిపోయినది

దొంగ వెంకట బాలకృష్ణ, తండ్రి: భాస్కరరావు అను నేను కాకిలేరు గ్రామ కాపురస్తుడైన నేను నా యొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఇంటి నుండి కాకిలేరు జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: L9733946 గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: దొంగ వెంకట బాలకృష్ణ
తండ్రి: భాస్కరరావు
డోర్ నెంబర్: 3-8, రామాలయం వీధి,
కాకిలేరు, ఇరగవరం మండలం,
ప॥గో॥జిల్లా, పిన్: 534320
సెల్: 9949566354

పాస్‌పోర్టు పడిపోయినది

గొలుగూరి హరి భామిరెడ్డి, తండ్రి: సత్యనారాయణరెడ్డి అను నేను నాయొక్క పాస్‌పోర్టు పడిపోయినది. ఆలమూరు నుండి మార్టేరు వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్టు మార్గ మధ్యంలో పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్: J5120610 గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

అడ్రస్: గొలుగూరి హరి భామిరెడ్డి
తండ్రి: సత్యనారాయణరెడ్డి
డోర్ నెంబర్: 1-166, ఆలమూరు
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా
పిన్: 534126, సెల్: 9441959739